# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఇంట్రి గ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ట్రిపల్-సీ) ద్వారా ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా, నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కృషి చేస్తోంది.
- ❖ పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు వజ్రాయుధం లాంటిదని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున పేర్కొన్నారు.
- ❖ విశాఖపట్నం- చెన్నై ఎగ్మోర్, విశాఖపట్నం హటియాల మధ్య రెండు జతల రైలు సర్వీసులను ప్రారంభించనున్నట్లు వాల్తేర్ రైల్వే డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ ఏ.కే. త్రిపాఠి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
- ❖ ఉత్తర కోస్తాలో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన ఇంట్రి గ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ట్రిపల్ "సీ") ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, మద్యం అక్రమ రవాణా, సీజర్లపై పటిష్టమైన పర్యవేక్షణ, నియంత్రణ చేపడుతోంది. అంతర్-రాష్ట్ర సరిహద్దులు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టుల నుండి వెళ్లే వాహనాల కదలికలను వెబ్ కాస్టింగ్ ద్వారా ట్రిపల్-సీ కేంద్రం నుండి పర్యవేక్షిస్తుంది. క్షేత్ర స్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు పర్చాలనే లక్ష్యంతో నిరంతరం పర్యటిస్తున్న ఫ్లైయింట్ స్క్వాడ్ బృందాలు, సెక్టోరల్ అధికారులు వినియోగించే వాహనాలు, ఇ.వి.ఎం.ల రవాణాకు వినియోగించే డిజిటి వాహనాల కదలికలను జిపిఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షిస్తుంది. అదేవిధంగా ప్రముఖ ఎలక్ట్రానిక్ తెలుగు చానళ్లలో నిరంతరాయంగా ప్రసారం అయ్యే వార్తాంశాలపై ప్రత్యేక దృష్టి సారించడమే కాకుండా, ప్రముఖ ఆంగ్ల, తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమయ్యే ఎన్నికల ప్రతికూల వార్తాంశాలపై తక్షణ చర్యలు తీసుకుంటూ ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు దోహదపడుతుంది.

=====================

పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు వజ్రాయుధం లాంటిదని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున పేర్కొన్నారు. ఈరోజు విశాఖ ఆకాశవాణి కేంద్రం నిర్వహించిన ఇంటర్వ్యూలో పాల్గొన్న కలెక్టర్ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు. మే 13న జరిగే ఎన్నికలలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవటం ద్వారా తమ ప్రథమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జిల్లాలో తొలిసారిగా ఓటు హక్కు పొందిన యువత ఓటు  వేయడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి అని కలెక్టర్ పిలుపునిస్తూ....

(వాయిస్ 40 సెకన్లు)

=====================

దక్షిణ అంతర్గత కర్ణాటక ప్రాంతాలపై సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల అవర్తనం కొనసాగుతుంది. దీనికి  అనుగుణంగా ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో  ఈశాన్య, ఆగ్నేయ దిశగా గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ లో ఈరోజు రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు  వర్షాలు, ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================

వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం- చెన్నై ఎగ్మోర్, విశాఖపట్నం హటియాల మధ్య రెండు జతల రైలు సర్వీసులను ప్రారంభించనున్నట్లు వాల్తే రైల్వే డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ ఏ.కే. త్రిపాఠి ఒక ప్రకటనలో తెలియజేశారు. వీటిలో  విశాఖపట్నం- చెన్నై ఎగ్మోర్- విశాఖపట్నం మధ్య ఈనెల 27 నుంచి జూన్ 30 వరకు మొత్తం 10 ట్రిప్పుల రైలు సర్వీసులు నడపనుంది. అలాగే విశాఖపట్నం హటియా విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైలును ఈనెల 28 నుంచి జూలై 1 వరకు 10 ట్రిప్పుల నిర్ధేశించిన సమయాల్లో నడుపనున్నట్లు తెలియజేశారు.

=====================

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఈరోజు విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా చెల్లూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జగన్ మోహన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.

విరామం

=====================

రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ప్రధాన పార్టీల తరఫున అభ్యర్థులు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు (ఆర్వో) సమర్పిస్తున్నారు.  ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీల్లో ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం జనసేన పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కె.పవన్ కళ్యాణ్, గుడివాడ అసెంబ్లీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీకి చెందిన వెనిగండ్ల రాము నామినేషన్ దాఖలు చేశారు. ధర్మవరం బీజేపీ అంసెబ్లీ అభ్యర్థిగా సత్యకుమార్, చిలకలూరిపేట నుంచి టీడీపీ మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుతో సహా రాష్ట్ర వ్యాప్తంగా పలు పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ నానేషన్లను దాఖలు చేస్తున్నారు. అలాగే నెల్లూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోక్ సభ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు.

=====================

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా ఎన్నికలను నిర్వహిస్తామని తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కృష్ణ కాంత్ పటేల్ అన్నారు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్పీ ఈరోజు తనిఖీ చేశారు. అలాగే మండలంలోని కొత్త కండ్రిగ, వెంకట రామాపురం, కమ్మపల్లి పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఓటర్లు ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

=====================

అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం అవ్వబోతున్న నేపథ్యంలో యాత్రికులు ఆయా జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రకు వెళ్ళే ప్రతి ఒక్కరూ జిజిహెచ్ లోని ప్రత్యేక డాక్టర్ల వద్ద ఆరోగ్య ధృవీకరణ పత్రాన్ని తీసుకోవాలని, జిల్లాల వారీగా స్పెషలిస్ట్ డాక్టర్ల వివరాల్ని www.jksasb.nic.in వెబ్ సైట్ లో ఉంచామని ఆమె వెల్లడించారు.

=====================

ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలనే లక్ష్యంతో ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ను తీసుకొచ్చిందని అనంతపురం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ లలో ఎలాంటి సందేహం ఉన్న జిల్లా అసెంబ్లీ స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేసి ఫిర్యాదులు తెలియజేయవచ్చన్నారు. అత్యవసర సేవలు అందించే 33 శాఖలకు చెందిన ఉద్యోగుల కోసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున 8 పోస్టల్ ఓటింగ్ సెంటర్లను రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలలో ఏర్పాటు చేశామన్నారు.

=====================

ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన "ప్రజాగళం" బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు విజయనగరం జిల్లాలోని గజపతినగరంలో మహిళలతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. ఆడపిల్లలను చదివిస్తే ఆర్థికాభివృద్ధి సాధిస్తారని పేర్కొంటూ... మహిళలకు విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక పేదరిక నిర్మూలనకు కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

=====================

మే 13వ తేది ఎన్నికల రోజున వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు విజయనగరం జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎన్.సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. సాదా దుకాణాలు, సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగి, కార్మికులకు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా ఆరోజున వేతనంతో కూడిన సెలవును ప్రకటించినట్లు తెలిపారు. ఏదైనా వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఏదైనా ఇతర సంస్థలలో ఉద్యోగం చేస్తున్న ప్రతి వ్యక్తి, శాసనసభ, లోక్ సభ ఎన్నికలలో ఓటు వేయడానికి అర్హులైన ప్రతి వ్యక్తికి, పోలింగ్ రోజున, తప్పనిసరిగా సెలవు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాతో కూడిన శిక్షార్హులవుతారని తెలియజేశారు.

=====================

ఎన్నికల ప్రచారంలో భాగంగా రేపు శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పాల్గొంటారని వైసీపీ నేత, మత్స్య, పశుసంవర్ధక శాఖల మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. ఈ రోజు పలాసలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మూలపేట పోర్టు నిర్మాణంకు సుమారు ఐదు వేల కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

======================

======================